క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గ్రామంలో సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు. దీని కారణంగా బోసుబొమ్మసెంటర్, సంజీవయ్య నగర్, లంబాడీపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలంలోని బొకినాల ఫీడర్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 7.30 నుంచి 12.30 గంటల వరకు బొకినాల గ్రామ పరిధిలోని వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని రైతులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



పెనమలూరు: క్యాన్సర్ రాకుండా మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గైనకాలజిస్టు, సర్జన్ డాక్టర్ తుమ్మల వర్షిత అన్నారు. కానూరు సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో ఆదివారం ఉమెన్స్ హాస్టల్‌లో రెడ్ క్రాస్ క్లబ్, మహిళా సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు 40 సంవత్సరాలు దాటిన తరువాత క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు. ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేయాలని సూచించారు. క్రమశిక్షణ జీవితం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. క్యాన్సర్‌పై అవగాహన అవసరమని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కె.నరేంద్ర, కె.సువర్ణ, ఎస్.వాణి, ఎం.ఉషా, పి.మాధవి, పి.రమాదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు


రామవరప్పాడు: గ్రామంలో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. గ్రామంలో దోమలకు నిలయాలుగా మారిన పలు అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లను పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పారుదలకు నోచుకోని డ్రెయిన్లను, చెత్త డంపింగ్ చేసే ప్రాంతాలను పరిశీలించి తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామంలోని ఖాళీ స్థలాలను గుర్తించి చెత్త డంప్ చేయకుండా, మురుగు నిల్వ లేకుండా మెరక తోలించుకోవాలని యజమానులకు సూచించామన్నారు. గ్రామస్తులు కూడా తమ నివాస పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త రోడ్లపై డంప్ చేయకుండా ఉండేందుకు సహకరించాలని కోరారు. దోమల నివారణకు డ్రెయిన్లలో త్వరలో ఆయిల్ బాల్స్ వేయిస్తామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో గంగానమ్మ సంబరం



కంకిపాడు: గంగానమ్మ అమ్మవారి సంబరాలు ఆదివారం కంకిపాడులో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణానికి చెందిన భక్తులు ఆలయం చుట్టూ పసుపు బట్టలతో ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు సమర్పించారు. గంగానమ్మ తల్లి నామస్మరణతో ఆలయం, పట్టణ వీధులు మారుమోగాయి. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడులతో గ్రామంలో ఊరేగింపు జరిపారు.

దివ్యాంగుల హక్కులపై పోరాటం



ఉయ్యూరు: దివ్యాంగుల హక్కుల సాధనకై కృషి చేస్తున్నామని వికలాంగుల హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరేపల్లి శివసాయిప్రసాద్ అన్నారు. వీహెచ్‌పీఎస్ 18 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉయ్యూరులో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోరాట సమితి ప్రతినిధులు కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. శివసాయిప్రసాద్ మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల సాధనకు పోరాట సమితి స్థాపించామన్నారు. కార్యక్రమంలో సమితి ఉయ్యూరు అధ్యక్షుడు ముజీబ్, మహిళా అధ్యక్షురాలు నూకల రజని పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని డొంక రోడ్లు

- పట్టించుకోని అధికారులు
- సర్వే చేసి నూతన రోడ్లు నిర్మించాలని రైతుల డిమాండ్



అధ్వానంగా బీబీగూడెం వద్ద డొంక రోడ్డు

గన్నవరంరూరల్: రైతులు వ్యవసాయానికి వినియోగించే డొంక రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వీటిని బాగుచేయించాల్సిన ప్రభుత్వ శాఖలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి గ్రామంలోనూ డొంక రోడ్లు ఉన్నాయి. గన్నవరం మండలంలో 21 గ్రామాలు ఉండగా, వీటిల్లో 18 వేల ఎకరాల్లో వరి సాగు అవుతోంది. ఉద్యానవన పంటలైన మామిడి, కూరగాయలు, ఇతర పంటలు 5 వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ప్రతి రోజు ఈ భూముల్లోకి రాకపోకలు డొంక రోడ్లపైనే సాగించాలి. ముస్తాబాద ఆయకట్టు 5 వేల ఎకరాలకు పైగానే ఉంది. అదే విధంగా మాదలవారిగూడెం, సూరంపల్లి, సావరగూడెం, పురుషోత్తపట్నం, కొండపావులూరు, గొల్లనపల్లి, బీబీగూడెం, గోపవరపుగూడెం, చిక్కవరం తదితర గ్రామాల్లో డొంక రోడ్లు కనీసం గ్రామానికి ఐదుకు పైగా డొంక రోడ్లు ఉన్నాయి. అంటే వందకు పైగా డొంక రోడ్లు వ్యవసాయ అవసరాలకు రైతులు నిరంతరం వినియోగిస్తుంటారు.

వ్యవసాయానికి ఆధారం డొంక రోడ్లే..

విత్తనం చల్లింది మొదలు పంట కోసే వరకూ, దానిని తరలించే వరకూ డొంక రోడ్లు ఉపయోగిస్తుంటారు. విత్తనాలు తీసుకువెళ్లేందుకు, దుక్కులు దున్నేందుకు, మందు చల్లేందుకు, సాగునీరు పెట్టేందుకు నిరంతరం ట్రాక్టర్‌లు ఈ రోడ్లుపై నడుస్తుంటాయి. తెంపల్లి నుంచి బీబీగూడెం వచ్చే డొంక రోడ్లు అధ్వానంగా



బీబీగూడెం వద్ద పంట కాలువలో పెరిగిన కంప

ఉన్నాయి. ముళ్లచెట్లుతో రోడ్లు కుంచించుకుపోయాయి. పంటకాల్వలు సైతం ముళ్ల చెట్లతో నిండిపోయాయి. వీటిలో ప్రజలు వ్యర్థాలు వేస్తున్నారు. అన్ని గ్రామాల్లోనూ పరిస్థితి ఈ విధంగానే ఉంది. . డొంక రోడ్లు దుస్థితిపై అధికారులు దృష్టి పెట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగించాలి..

పలు గ్రామాల్లో డొంక రోడ్లు ఆక్రమణలకు గురయ్యాయి. పంట కాలువలు పరిమాణం తగ్గిపోయాయి. ఏ గ్రామానికి ఆ గ్రామంలో వీఆర్వో చేత డొంక రోడ్లు, పంట కాలువలు సర్వే చేయించాలని రైతులు కోరుతున్నారు. సూరంపల్లి, ముస్తాబాద, మాదలవారిగూడెం గ్రామాల్లో పరిశ్రమల వ్యర్థాలు పంటకాలువల్లో, డొంక రోడ్లలో వేస్తున్నారు. ఈ పరిస్థితి మార్చాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల ద్వారా పంట కాలువలు బాగు చేయాల్సి ఉంది. ఈ సంవత్సరం డొంక రోడ్ల పక్కనే ఉన్న పంటకాలువలు బాగు చేయించాలని, ఆక్రమణలు తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్లే ప్రధాన రహదారుల వెంట పెద్దపెద్ద పంట కాలువలుంటాయి. వాటిని సర్వే చేసి ఆక్రమణల చెర నుంచి కాపాడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సర్వే చేసి కొత్త రోడ్లు నిర్మించాలి



డొంక రోడ్లు సర్వే చేసి కొత్త రోడ్లు నిర్మించాలి. వ్యవసాయం డొంక రోడ్లపైనే ఆధారపడి ఉంది. పండించిన ధాన్యం తరలించాలంటే ఈ రోడ్లే శరణ్యం. పంట కాలువలు కూడా బాగు చేయించాలి.

– రామినేని రవిబాబు, సావరగూడెం, రైతు

రోడ్లు, పంట కాలువలు బాగు చేయాలి



రైతులకు మేలు చేసే పంట కాలువలు, డొంక రోడ్లను ప్రభుత్వం ఆధునీకరించాలి. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఎస్టీ మేట్లు వేయాలి. రోడ్ల నిర్మాణాన్ని తక్షణమే ప్రారంభించి, పూర్తి చేయాలి.

– మల్లంపల్లి ఆంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి, గన్నవరం

సైక్లింగ్‌తో ఆరోగ్యం



పెనమలూరు: సైక్లింగ్ చేయటం వలన వ్యక్తిగత ఆరోగ్యం చేకూరుతుందని సిద్ధార్థ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ క్రీడోత్సవాల ముగింపు సందర్భంగా యూనివర్సిటీలో ఆదివారం సైకిల్ ర్యాలీ చేశారు. సైక్లింగ్ చేయటం క్రీడల్లో భాగమైనా, ప్రతి రోజు సైక్లింగ్ చేయటం వలన ఆరోగ్యం బాగుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కటం వలన ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రో.ఉపకులపతి డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

6న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని అధ్యక్షతన జరిగే సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రత్యేక, శాశ్వత ఆహ్వానితులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన అధ్యక్షులకు బాధ్యతలు అప్పగిస్తున్న మిరియాల

గన్నవరం: లయన్స్ క్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ నూతన అధ్యక్షుడిగా దండమూడి శ్రీనివాసరావు నియమితులయ్యారు. మండలంలోని కేసరపల్లిలో ఉన్న అమ్మ వయో వృద్ధాశ్రమంలో ఆదివారం లయన్స్‌క్లబ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నూతన కార్యదర్శిగా శ్రీరామ్ శ్రీనివాస్, కోశాధికారిగా చెరుకూరి షీలా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎంఎల్ఎస్ఆర్‌కే ప్రసాద్, అనుమోలు వెంకటేశ్వరరావు, కారంపూడి సాంబశివరావు, వజ్రాల కృష్ణారెడ్డి, దండమూడి మహీధర్ నియమితులయ్యారు. అనంతరం నూతన కార్యవర్గంతో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో లయన్స్‌క్లబ్ కీలకపాత్ర వహిస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలనకు, విద్య, వైద్య పరంగా లయన్స్‌క్లబ్ విశేష సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో నూతన కార్యవర్గం పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

జిల్లా స్థాయి యోగాసన పోటీలు ప్రారంభం



యోగాసనాల పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రతి ఒక్కరూ యోగాను చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ చెప్పారు. కృష్ణా జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబ్లీ హరిత సంయుక్త ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలో ఆదివారం ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి యోగాసన పోటీలు జరిగాయి. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చక్కటి ఆరోగ్యానికి యోగా రామబాణం వంటిదన్నారు. సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ చదువుతో పాటుగా యోగాపై కూడా దృష్టి పెట్టాలన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లాలో ఉన్న 107 లయన్స్ క్లబ్స్‌లో లయన్స్ జూబ్లీ హరిత క్లబ్ సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని అన్నారు. లయన్స్ క్లబ్ జూబ్లీ హరిత అధ్యక్షుడు కోటా ఫణి, కార్యదర్శి కాకాని శ్రీనివాసరావు, కోశాధికారి తిరుమలరావు, యోగా గురువు, యోగాసన పోటీల కో–ఆర్డినేటర్ అంకాల సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, శాప్ యోగా కోచ్ ఆర్.రవి, కృష్ణాజిల్లా డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ, గుంటూరు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైత్రి, డి.ధీరజ్ శ్రీకృష్ణ చేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు నూకల సాంబశివరావు, లయన్స్ జిల్లా సెకండ్ వైస్ గవర్నర్ శ్రీనివాస రెడ్డితో పాటుగా ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి అధిక సంఖ్యలో యోగ సాధకులు హాజరై ఆసనాలు ప్రదర్శించారు.

వెళ్లిరా.. గణపయ్యా



కానూరులో పూజలు చేస్తున్న మహిళలు

పెనమలూరు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో ఐదు రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను నిర్వాహకులు కోలాహలంగా నిమజ్జనోత్సవానికి తరలించారు. మండల పరిధిలో ఆదివారం 100 వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతి రోజు నిమజ్జన కార్యక్రమం చోడవరం, పెదపులపాక కృష్ణానదిలో చేస్తున్నారు. కానూరు మురళీనగర్ వెంకట్రామ అపార్ట్‌మెంట్స్‌లో వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనం చేశారు. తాడిగడప శ్రీ మిత్రా జూయెల్ అపార్టుమెంట్స్‌లో 100 మంది చిన్నారులు వినాయకుడి ప్రతిమలతో ప్రదర్శన నిర్వహించి నిమజ్జనం చేశారు. పెనమలూరు పల్లిపేటలో చిన్నారులు కోలాటం ఆకట్టుకుంది. పెనమలూరు కొండల్యానగర్‌లో భారీగా వినాయకుడి ఊరేగింపు చేశారు. పోరంకి గ్రామ దేవత గంగానమ్మ గుడి వద్ద వినాయకుడిని ప్రత్యేక వాహనంలో గ్రామ వీధుల్లో ఊరేగించారు. గ్రామ రామాలయం వద్ద 2 వేల మంది భక్తులను అన్నసమారాధన చేశారు.

వైభవంగా గణేష్ నవరాత్రులు

ఉయ్యూరు: ఉయ్యూరు కాలేజ్ రోడ్డులోని రాఘవేంద్ర హైట్స్‌లో రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన జరిపించారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలంలో యలమంచిలి రామచంద్రమూర్తి రూ.30 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. యువత గణనాథుడిని ఉత్సాహంగా ఊరేగింపుగా తీసుకెళ్లి కాలువలో నిమజ్జనం చేశారు.



జంక్షన్‌లోని ధరణి అపార్ట్‌మెంట్స్ వద్ద గణనాథుని ఊరేగింపు

వినాయక ఆశీస్సులు అందరికీ ఉండాలి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్‌లో వినాయకునికి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలతో పాటు ఉట్టికొట్టే కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు,కోలాటం, చివరి రోజు అన్నదానం, ప్రసాదం వేలం నిర్వహించారు. స్వామివారిని ఊరేగింపుగా మేళతాళాలతో తీసుకెళ్లి పోలవరం కాల్వలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీఎస్ శ్రీనివాస్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాడవాడలా ఊరేగింపులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ఇందిరానగర్, రాజుల కాలనీ, తారకరామ కాలనీ, స్టేట్ బ్యాంక్ వీధి, ధరణి అపార్ట్‌మెంట్స్‌లో వినాయక ఉత్సవ మండపాల్లో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అనంతరం గణనాథులను నిమజ్జనాలకు తరలించారు. మేళతాళాలు, బాణసంచా కాల్చుతూ, నృత్యాలు చేస్తూ, ఎంతో ఉత్సాహంగా గణనాథుల నిమజ్జన ఊరేగింపులు జరిగాయి. బాపులపాడు మండలం పెరికీడులోని ఏలూరు కాలువ వద్ద గణేష్ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. ఏలూరు కాలువ వద్ద పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు, బందోబస్తు నిర్వహించారు.



పెనమలూరులో నిమజ్జనం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



ఉయ్యూరులో లడ్డూ దక్కించుకున్న రామచంద్రరావు



వికాస్ కాలేజీలో పూజలు

వైభవంగా గణపతి ఉత్సవాలు

గన్నవరం: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా గణేష్ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కేసరపల్లిలోని శ్రీహేమదుర్గ జ్యువెల్ కౌంటీలో ఆదివారం మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు దంపతులచే శ్రీలక్ష్మీగణపతి హోమం జరిపారు. తొలుత స్వామివారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. ఉపసర్పంచ్ జాస్తి శ్రీధర్‌బాబు, న్యాయవాది కేవీ రమణ, నాగ సురేష్, కేహెచ్ కోటేశ్వరరావు, జాస్తి వెంకటేశ్వరరావు, రాజులపాటి శ్రీనివాసరావు, కెల్లా రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో గణనాథుడికి పూజలు నిర్వహించారు. గన్నవరం, కేసరపల్లి, బుద్దవరం, అల్లాపురం గ్రామాల్లో ఉత్సవాలు కొనసాగుతున్నాయి.



కేసరపల్లిలో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

వినాయక స్వామికి లక్ష గరిక పూజ

నున్న(విజయవాడరూరల్): గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం చినకంచి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ దేవస్థానంలో లక్ష గరికపూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. తొలుత గణపతి హోమం, వేదస్వస్తి నిర్వహించారు. స్వామివారికి లక్ష గరికతో అలంకారం చేసి పూజలు చేశారు. ద్వారం వద్ద ఉన్న విజయ గణపతికి, కోష్టం నందున్న నృత్య గణపతికి కూడా గరికపూజ చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు మొక్కపాటి శర్మ, దుర్గాప్రసాద్, కొండేటి రాంబాబు, జంగల్వల ఉమామహేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు స్వీకరించారు.



చినకంచిలో వినాయకస్వామి

గణనాథుడికి ప్రత్యేక పూజలు

కంకిపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లోని చలువ పందిళ్లలో వేంచేసి ఉన్న గణనాథులకు భక్తులు భక్తితో పూజలు చేశారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కంకిపాడు పట్టణంలోని పలు వినాయక మందిరాలను సందర్శించి పూజలు చేయించారు. కార్యక్రమంలో తుమ్మలపల్లి హరికృష్ణ, తుమ్మల చంద్రశేఖర్, చిట్టూరి నాగేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకట రమణ, ముప్పా రాజా, వీరంకి శ్యాం, షేక్ చిన్న నాసర్‌వలీ(నన్నా), షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు. ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో వేంచేసిన వినాయకుడి ఊరేగింపు మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది.



కంకిపాడులోని పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ప్రొద్దుటూరు గాయత్రీ విహార్‌లో పూజలు చేస్తున్న భక్తులు

జిల్లాలకు మహనీయుల పేర్లు పెట్టాలి

సోషల్ జస్టిస్ ఫోరం కన్వీనర్ రావి శ్రీనివాస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాజ సేవకు జీవితాన్ని అంకితం చేసిన వారి పేర్లను జిల్లాలకు పెట్టాలని సోషల్ జస్టిస్ ఫోరం, కాపు ఐక్యవేదిక, బీసీ ఐక్యవేదికలు డిమాండ్ చేశాయి. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో సోషల్ జస్టిస్ ఫోరం కన్వీనర్ రావి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జీవిత సర్వస్వాన్ని సమాజ సేవకు అంకితం చేసిన మహనీయుల పేర్లు జిల్లాలకు పెట్టడం సముచితమన్నారు. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం – సర్దార్ గౌతు లచ్చన్న శ్రీకాకుళం జిల్లా, కృష్ణా – వంగవీటి మోహన్ రంగా కృష్ణాజిల్లా, గుంటూరు – గుర్రం జాషువా గుంటూరు జిల్లా, పల్నాడు – కన్నెగంటి హనుమంతు పల్నాడు జిల్లా, కర్నూలు – దామోదరం సంజీవయ్య కర్నూలు జిల్లా, అనంతపురం – శ్రీకృష్ణదేవరాయ అనంతపురం జిల్లాగా నామకరణం చేయాలని కోరారు. ఆయా జిల్లాలకు మహనీయుల పేర్లు పెట్టడం ద్వారా సామాజికవర్గాల ఆత్మ గౌరవం, ఆత్మాభిమానం ఇనుమడిస్తాయన్నారు. తక్షణమే ఆయా జిల్లాలకు ఆయా పేర్లు పెట్టాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జంగాల సింగరయ్య యాదవ్, మాసాబత్తుల శ్రీనివాస్, దానగౌడ్, బొడపాటి పెదబాబు, కాకిలేటి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫోరం కన్వీనర్ రావి శ్రీనివాస్ తదితరులు

•విద్యార్థులకు ధ్యాన శిక్షణ తరగతులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు ధ్యానం చేసే విధానంపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ కె.రమాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తన దైనందిన జీవితంలో ధ్యానంను భాగంగా చేసుకోవాలని సూచించారు.